ప్రజాశక్తి
ఆదివారం 2 ఏప్రిల్ 2023
5
పార్వతీపురం మన్యం

మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్ : మిషన్ వాత్సల్య స్కీమ్‌లో భాగంగా స్పాన్సర్ షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకంలో భాగంగా స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా నిరాధరణకు గురైన బాలలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడేలా ఆర్థికంగా ఆదుకోవడానికి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితికి అనుబంధంగా షరతులతో కూడిన ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. స్పాన్సర్‌షిప్ ద్వారా ఎంపికైన పిల్లలకు నెలకు ఒక్కొక్కరికి రూ.4 వేలు అందించడం జరుగుతుందని తెలిపారు. కోవిడ్19 కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిఎంకె పథకం కింద నమోదైన పిల్లలు ఈ స్కీంకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. బాలుడు, బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, మరణానికి గల కారణాలు.సంరక్షకుని ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డ్, బాలుడు/బాలిక పాస్ పోర్ట్ ఫోటో,ప్రస్తుతం స్కూల్లో చదువుతున్న స్టడీ సర్టిఫికేట్, బ్యాంక్ అకౌంట్ వివరాలు మొదలగు ధ్రువపత్రాలు అవసరని ఆమె తెలిపారు.

పరిహార(స)ం

- ప్యాకేజీ, పునరావాసానికి నోచని టిటిపిఆర్ నిర్వాసితులు
- ఏటా మొక్కుబడి కేటాయింపులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తోటపల్లి, తారకరామతీర్థసాగర్ (టిటిపిఆర్) నిర్వాసితుల పరిహారం, పునరావాసం పరిహాసంగా మారింది. భూములు, ఊళ్లు కోల్పోయిన బాధితులకు దశాబ్దాలు గడిచినా నష్టపరిహారం, పునరావాసం అందని పరిస్థితి. భూసేకరణ విషయంలో పాలకులు 'యేరు దాటే వరకు ఓడ మల్లన్న, ఒడ్డుకు చేరాక బోడిమల్లన్న' అన్న చందంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. నిర్వాసిత సమస్యలను అధ్యయనం చేసేందుకు గత ఏడాది జులైలో ఆర్అండ్ఆర్ కమిషనర్ జిల్లాలో పర్యటించినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో, నిర్వాసితులంతా నిలువ నీడలేక, వ్యవసాయ భూములకూ దూరమై... బతుకు బారమై తల్లడిల్లుతున్నారు. జిల్లాలో నాలుగు మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టిన విషయం విధితమే. పునరావాసానికి ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు అవసరం కానుంది. పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74 కోట్లు అవసరం కానున్నట్టు అధికారులు అంచనా రూపొందించారు. కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ. 54.66 కోట్లు వెరసి మొత్తం రూ.175.4కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమేరకూ సరిపోయే పరిస్థితి లేదు.

2003లో తోటపల్లి నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. ఇప్పటికీ నిర్వాసిత కాలనీలు మొండిగోడలతోనూ, పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కూడా కోరుతున్నారు. నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామినాయుడువలస వారికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్‌వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్అండ్ఆర్ కింద రూ.120 కోట్లు అవసరమౌతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇందులో కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే రూ.106.8 కోట్లు అవసరం కానుంది. ఆర్అండ్ఆర్‌కు ప్రభుత్వం కేవలం రూ.3.96కోట్లు మాత్రమే కేటాయించింది.

కుల వివక్షపై తక్షణ చర్యలు

జిల్లా విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

అంటరానితనం, వివక్ష వంటి సంఘటనలు జరిగితే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టరు అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం, అత్యాచారం, దాడులకు గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించాలన్నారు. పరిహారం పెండింగు గల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఏర్పాటైనప్పటి నుంచి నమోదైన పది కేసుల ప్రస్తుత పరిస్థితిపై, కేసు వారీగా సమీక్ష నిర్వహించారు. కేసులు నమోదులో జాప్యం ఉండకూడదని, అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే బాధితులకు అందించాలని అధికారులను ఆదేశించారు. డివిజినల్ స్థాయి సమావేశాలు నిర్వహించి కేసులపై సమీక్ష నిర్వహించాలన్నారు. అంటరానితనంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కమిటీ సభ్యులు ప్రజలతో మాట్లాడి వారికి సమస్యలు ఉంటే తెలుసుకోవాలన్నారు. పెండింగులో గల కేసుల వారీ వివరాలు, బాదితులకు అందించిన పరిహారం పై సమీక్షించారు. ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నమోదైన పది కేసులలో తొమ్మిది విచారణ దశలో ఉండగా, ఒక కేసు కోర్టులో ట్రైల్ దశలో ఉన్నదని తెలిపారు. బాధితులకు కావలసిన సర్టిఫికెట్స్ వెంటనే అందిస్తున్నామన్నారు. సమావేశంలో జెసి ఒ.ఆనంద్, సబ్‌కలెక్టరు నూరుల్ కమర్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, డిఎస్‌పిలు, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు ఎం.దేవుల నాయక్, జిల్లా పశుసంవర్థక అధికారి ఎ.ఈశ్వరరావు, జిల్లా అగ్నిమాపకఅదికారి కె.శ్రీనుబాబు, కమిటీ సభ్యులు గునగంజి చంద్రయ్య, పిరపాక శ్రీనివాసరావు, మెయి లక్ష్మీకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, అధికారులు

మృతదేహాలతో ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తున్న టిడిపి, సిపిఎం, జనసేన నాయకులు

మృతుల కుటుంబాలకు సాయం చేయాలి

మృతదేహాలతో జిల్లా ఆసుపత్రి, ఐటిడిఎ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్

కొమరాడ మండలం సర్వపాడులో శుక్రవారం ఇంటి గోడ కూలి మృతి చెందిన శంకర్రావు, మాణిక్యమ్మ, గాయపడిన వారి కుటుంబాలకు ఆర్థికంగా సాయం చేయాలని శనివారం జనసేన, సిపిఎం, టిడిపి నాయకులు స్థానిక జిల్లా ఆసుపత్రి, ఐటిడిఎ వద్ద మృతదేహాలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, చినకేర్జిల సర్పంచ్ హిమరిక గంగాధర్, దాలి నాయుడు, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, నాయకులు శేఖర్ పాత్రుడు, గులిపల్లి సుదర్శన రావు, దేవకోట వెంకటనాయుడు, కోలక ధర్మారావు, బలరాం నాగేశ్వర రావు, మరడాన తిరుపతి నాయుడు, మరిశర్ల సింహాచలం, పడాల హరి ప్రసాద్,వప్పంగి రాఘవేంద్ర, బత్తిల శ్రీను, పాలక నూకరాజు, నందివాడ కష్ణ బాబు, చినకేర్జిల మాజీ సర్పంచ్ నందిగాన ప్రసాద్ తదితరులు జిల్లా ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం పోస్ట్ మార్టం నిర్వహించిన మృతదేహాలను ఐటిడిఎ వద్దకు ర్యాలీగా తీసుకువెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొమరాడ మండలం అంటివలసలో ఆటో ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికీ నయా పైసా కూడా చెల్లించలేదన్నారు. దీంతో బాధిత కుటుంబాలు వీధిపాలవుతున్నాయన్నారు. సర్వపాడులో ఇంటి గోడ కూలి మృతి చెందిన శంకర్రావు, మాణిక్యమల కుటుంబాలతోపాటు గాయపడిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్‌ను కలిసి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. దీనికి పిఒ నిధులు లేవంటూ తేల్చి చెప్పడంతో వారు వెనుతిరిగారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరడంతో చివరికి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న అంబులెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటిడిఎ ఉన్న గిరిజనులకు ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు.

అనుకున్నదొక్కటి... అయ్యిందొక్కటి

- మోడల్ స్కూల్‌లో టెన్త్ పరీక్షా కేంద్రం
- సాలూరులో ఉన్నట్టు చూపిన అధికారులు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - సాలూరు

పదోతరగతి పరీక్షలు ఈనెల 3నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు నెల రోజుల ముందు గానే పరీక్షా కేంద్రాల ప్రతిపాదన, అక్కడ సౌకర్యాల పరిశీలన, తర్వాత అధికారుల నిర్ధారణ జరుగుతుంది. ఈ ఏడాది కొత్తగా సాలూరు మండలం పురోహితునివలస మోడల్ స్కూల్‌ను టెన్త్ పరీక్షలకు కేంద్రంగా అధికారులు ఎంపిక చేశారు. బాగువలస, బోరబంద, శివరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు మోడల్ స్కూల్ విద్యార్థులకు అనువుగా ఉంటుందని భావించి మోడల్ స్కూల్‌ను పరీక్షా కేంద్రంగా చేయాలని మండల అధికారులు ప్రతిపాదించారు. ఈ మూడు పాఠశాలలకు చెందిన టెన్త్ విద్యార్థులు ఏటా దూరప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాయాల్సి వస్తోందని భావించి మోడల్‌స్కూల్‌ను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. అంతవరకూ బాగానే ఉంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం తప్పుటడుగు వేశారు. పురోహితునివలసలో ఉన్న మోడల్ స్కూల్‌ను సాలూరు పట్టణంలో ఉన్నట్టు చూపించారు. దీంతో అధికారులు పట్టణంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పదిమంది చొప్పున మోడల్ స్కూల్ కేంద్రానికి కేటాయించారు. మొత్తం 140మంది విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారు. అయితే మోడల్ స్కూల్ విద్యార్థులకు మాత్రం అక్కడ పరీక్షలు రాసే అవకాశం లేదు. పట్టణానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పురోహితునివలస మోడల్ స్కూల్‌కు రోజూ విద్యార్థులు పరీక్ష రాయడానికి వెళ్లాల్సి ఉంటుంది. ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. ఆటోలు అరుదుగా తిరుగుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు రోజూ పురోహితుని వలస వెళ్లి పరీక్షలు రాయడం వ్యయప్రయాసలతో కూడుకున్నది. మండల అధికారులు ఈ ప్రాంత పాఠశాలల విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని మోడల్ స్కూల్‌ను పరీక్ష కేంద్రం చేస్తే వారికి మేలు జరగకపోగా కొత్త చిక్కులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. జిల్లా విద్యాశాఖ అధికారుల తప్పుడు ప్రతిపాదన కారణంగా మోడల్ స్కూల్‌ను పట్టణంలో ఉన్నట్టు చూపించినట్లు తెలుస్తోంది. దీనిపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కూడా జిల్లా అధికారులకు అక్షింతలు వేసినట్లు సమాచారం. మండల అధికారులు ఒకటి అనుకుంటే జిల్లా అధికారులు మరో విధంగా చేయడంతో విద్యార్థులకు కొత్త కష్టాలు మొదలు కానున్నాయి.

కొటియా గ్రామాలు ఒడిశావే

- ఆంధ్రా అధికారులు గో బ్యాక్
- పట్టుచెన్నూరు పర్యటనలో కేంద్ర మంత్రి నోటి దురుసు

ప్రజాశక్తి - సాలూరు

కొటియా గ్రామాలు ఒడిశాకు చెందినవి, ఆంధ్రా అధికారులకు ఇక్కడేం పని, గో బ్యాక్ అంటూ సాక్ష్యాత్తు బిజెపి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. ఒడిశా అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన పట్టుచెన్నూరులో శనివారం పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు అక్కడ ఉన్న ఆంధ్రాకు చెందిన కొటియా సిఐ రోహిణి పతిని పిలిచి పరుషంగా మాట్లాడారు. ఇక్కడ మీకేం పని అంటూ కేంద్ర మంత్రి సిఐని ప్రశ్నించగా 21కొటియా గ్రామాలు ఒడిశా-ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వివాదాస్పద గ్రామాలని సిఐ చెప్పారు. దీనిపై కేంద్ర మంత్రి మాట్లాడుతూ కొటియా గ్రామాలు ఒడిశావి, ఆంధ్రా గో బ్యాక్ అంటూ వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వెంట ఉన్న బిజెపి నాయకులు, కార్యకర్తలు కూడా ఆంధ్రా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. గత కొంత కాలంగా వివాదాస్పద కొటియా గ్రామాల్లో పర్యటించకుండా ఎపి అధికారులను ఒడిశా అడ్డుకుంటోంది.


గుమ్మలక్ష్మీపురం : మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న ఐఎఫ్‌ఎస్ అభ్యర్థులు

క్షేత్ర స్థాయి పర్యటనలో ఐఎఫ్‌ఎస్ అభ్యర్థులు

ప్రజాశక్తి - పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం

2022 ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులు పూసపాటి సాహిత్య (విశాఖపట్నం), దుబ్బాడ ఎస్.వి.అశోక్ (కాకినాడ) జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి వి.విద్యాసాగర్‌నాయుడును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం కలుసుకున్నారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) చెందిన అభ్యర్థులు క్షేత్ర స్థాయి శిక్షణా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యటించారు. పరిపాలనాపరమైన అంశాలను జిల్లా కలెక్టర్, ఎస్‌పి వివరించారు. జిల్లాలో చేపడుతున్న వివిధ పనులు, కార్యక్రమాలను తెలిపారు. జిల్లాలో ప్రజల జీవన విధానాన్ని వివరించారు. అనంతరం గుమ్మలక్ష్మీ పురం, కురుపాం మండలాల్లో పర్యటించారు. గుమ్మలక్ష్మీపురం గోరంట స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తాము చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. ఇరిడిలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు కేంద్రం అందిస్తున్న వివరాలను సిబ్బంది తెలిపారు. కురుపాంలో గ్రామ సచివాలయాన్ని పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కురుపాం ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, భోజన వసతులు గమనించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సమన్వయ అధికారిగా టిపిఎంయు ఎపిడి వై.సత్యంనాయుడు పాల్గొన్నారు.

కార్యదర్శి సస్పెన్షన్

పార్వతీపురం రూరల్ : మండలంలోని పెదమరికి సర్పంచ్ హెచ్.గంగమ్మ చెక్ పవర్‌ను రద్దు చేయడమే కాకుండా పంచాయతీ కార్యదర్శి ఎస్‌వి చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయితీ నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్న వీరిని, ఎంపిడిఒ, డివిజనల్ మండల అభివద్ధి అధికారి విచారణ జరిపి, అందించిన నివేదికల ప్రకారం జిల్లా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

తొలి తీర్మానం చేసింది టిడిపియే

ఆసరా చెక్కుల పంపిణీలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తొలుత తీర్మానించింది టిడిపియేనని డిప్యూటీ సీఎం రాజన్నదొర ధ్వజమెత్తారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మహిళలకు ఆసరా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమంలో ఆయన ఆవేశంగా మాట్లాడారు. గతంలో బోయ, వాల్మీకి లను గిరిజనుల జాబితాలో చేర్చాలని కోరుతూ తీర్మానాన్ని కేంద్రానికి పంపించిన టిడిపి ఇప్పుడెలా గిరిజనుల పోరాటానికి మద్దతు ఇస్తుందని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం నేరుగా పేదలకే ఆర్థిక లబ్ధి చేకూరుస్తుంటే టిడిపి నాయకులు అడ్డగోలుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం మహిళలకు ఆసరా సాయం చెక్కులను అందజేశారు. ఆ తర్వాత మహిళలు సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్లు వంగపండు అప్పల నాయుడు, జర్జాపు దీప్తి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు, కౌన్సిలర్లు గిరిరఘు గొర్లి వెంకటరమణ లక్ష్మణరావు, రాపాక మాధవరావు, లింగాల దుర్గా, కమిషనర్ హెచ్ శంకరరావు, మెప్మా సిఎంఎం ఎం.పుష్ప పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కొమరాడ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కులను ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అందజేశారు. మండలంలో 854, స్వయం సహాయక సంఘాల్లో గల 9,693 మంది సభ్యులకు రూ.4.30 కోట్లు చెక్కులు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు, తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ, ఎంఇఒ జామి నారాయణ స్వామి, వైసిపి కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన, కొమరాడ పిఎసిఎస్ అధ్యక్షులు యం.సూరపునాయుడు, నాయకులు సింహాచలం, ఎంపిటిసిలు, సర్పంచులు, మహిళలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మండల కేంద్రమైన భామినిలో ఎంపిపి తోట శాంతికుమారి అధ్యక్షతన ఎపిఎం డి.భవాని ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కులను పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలంలోని 702 మహిళా సంఘాలకు రూ.3 కోట్ల 72 లక్షలు చెక్కును అందజేశారు. అనంతరం జగన్ చిత్రపటానికి మహిళా సంఘాలు పాలభిషేకం చేశాయి. కార్యక్రమంలో వెలుగు ఎపిడి బి.నారాయణరావు, వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, ఎంపిటిసిలు టింగ అన్నాజీరావు, కొత్తకోట చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి సోమరాజు గోపాలరావు, సర్పంచులు భార్గవ నాయుడు, మడపాన కేశవ, చంటి, కొత్తూరు ప్రసాదరావు, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, వైసిపి నాయకులు మెడిబోయిన చలపతి, అర్లి రాజశేఖర్, సంజీవ్, గేదెల మోహన్, తహసీల్దార్ అప్పారావు, వెలుగు సిబ్బంది, మహిళలు వున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం : పిఒ

సాలూరు : మున్సిపాలిటీ, మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, మండల హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఇంతవరకు ప్రారంభం కాని ఇళ్లను ప్రారంభించేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక దశ నుంచి మరో దశకు నిర్మాణం చేరేలా చూడాలన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పని చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు, హౌసింగ్ డిఇ సోమేశ్వరరావు, ఎఇ శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులు, ఎంపిడిఒ పార్వతి పాల్గొన్నారు.

'ఉపాధి' నిర్వీర్యమైతే ఉనికికే ప్రమాదం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వార్షిక ఆదాయంలో ఆఖరి స్థానం. తలసరి ఆదాయమూ అత్యల్పమే. అక్షరాస్యతలో వెనుకబాటు. వీటన్నింటికీ పాలకుల నిర్లక్ష్యమే కారణం. పుష్కలమైన సాగునీటి వనరులు ఉన్నా, అవసరానికి తగట్టు వర్షపాతం నమోదవుతున్నా వాటిని ఒడిసిపట్టి సాగునీటి అవసరాలు తీర్చేందుకు పాలకులు చొరవ, ముందుచూపు లేకపోయింది. దీంతో, జిల్లాలో ఎంతో సారవంతమైన భూములు ఉన్నా వాటిని సాగుచేసేందుకు అవకాశం లేకపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో 2005లో అమల్లోకి వచ్చిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం జిల్లా పాలిట ఓ వరమే. ఔను...! మిగిలిన జిల్లాల సంగతి కాస్త పక్కనబెడితే విజయనగరం ఉమ్మడి జిల్లాకు ఈ పథకం మాత్రం బృహత్తర కార్యక్రమమే. కొన్ని దశాబ్ధాల కాలానికి ముందుకెళ్తే ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యధిక వలస కూలీలు ఉండేవారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పేదలెందరో. పాలేర్లుగా ఎక్కువగానే తారసపడుతుండేవారు. ఇటువంటి పరిస్థితుల్లో 2005లో కమ్యూనిస్టుల మద్ధతుతో వచ్చిన యుపిఎ-1 ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా ఏటా వంద రోజుల పని గ్యారెంటీ చేశారు. పని కోరుకునేందుకు జాబ్‌కార్డులు జారీచేశారు. కోరిన వెంటనే పని కల్పించాలని, సకాలంలో పని కల్పించకపోతే నష్టపరిహారం కూడా చెల్లించాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. పొట్ట కూటి కోసం ఊరుకాని ఊళ్లు వలసపోయే కుటుంబాలవారికి ఇది ఎంతో ఆసరాగా నిలిచించింది. అంత వరకు ముసలి తల్లిదండ్రులను, చదువుకుంటున్న పిల్లలను వదిలి వలసపోయే భార్యా భర్తలకు కొంతలో కొంతయినా గ్రామంలోనే ఇంటిళ్లపాది కలిసివుండే అవకాశం లభించింది. స్థానికంగానే వంద రోజులు పని గ్యారెంటీ దొరుకుతుండడంతో గతంతో పోలిస్తే వలసలు తగ్గాయి. సేద్యానికి ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోకపోయినా, పంటలు పెద్దగా కలిసి రాకపోయినా, పండిన పంటలకు పెద్దగా గిట్టుబాటు ధర పలకపోయినా, పెరిగిన ధరల ప్రవాహంలో కొట్టుకుపోయినా ఏడాదిలో వంద రోజుల పని గ్యారెంటీ కావడంతో జిల్లాలో మెజార్టీ ప్రజానీకానికి ఉపాధి చట్టం ఎంతో భరోసా ఇచ్చింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 3.51లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 1.68లక్షల చొప్పున మొత్తం ఈ రెండు జిల్లాల్లో 4.19లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరంతా పని దినాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటు న్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఒక్క విజయనగరం జిల్లాలోనే సుమారు రూ.300కోట్ల మేర కూలీలకు సమకూరింది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే స్థాయిలో డబ్బులు చేతికందాయి. ఇందువల్లే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొంతలో కొంతైనా కళకళాడుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతెందుకు 2020 నుంచి 2021 వరకు సుమారు రెండేళ్లపాటు కరోనా వల్ల విధించిన లాక్‌డౌన్ వల్ల దేశమంతా అతలా కుతలమైనా గ్రామాల్లోని ఉపాధి కూలీలు మాత్రం భద్రంగా బతికేశారు. ఇలా ఈ పథకాన్ని ఉపయోగించడంలో విజయనగరం ఉమ్మడి జిల్లా దేశానికే ఆదర్శంగా నిలిచింది. అందుకే ఇక్కడి జిల్లా కలెక్టర్లకు గవర్నర్‌తో ప్రసంశలు, జాతీయ ఎన్నో అవార్డులు, రివార్డులు సైతం లభించాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు శత విధాలా ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా రెండో సారి అధికారంలోకి వచ్చాక ఉపాధి చట్టానికి వందల రూ.కోట్లు నిధులు కోత విధిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఉపాధి పనులకు ఈ ఏడాది రూ.73వేల కోట్లను కుదించింది. ఈ ప్రభావం దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాలతోపాటే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలపైనా పడుతుంది. దీని నుంచి దృష్టిమళ్లించేందుకు గత ఏడాది నుంచీ యాప్ ఆధారిత హాజరు అమల్లోకి తీసుకొచ్చింది. రెండు పూటలా పని తప్పనిసరి చేసింది. దీంతో, శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. విజయనగరం జిల్లాలో 2021-22లో ఒక్కపూట పనిచేస్తే కార్మికుడి వేతనం రూ.250 నుంచి రూ.257 అందగా, 2022-23లో రెండు పూటల పనిచేసినా రూ.200కు మించలేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ కూలిరేటు కాస్త అటు ఇటు అయినా వ్యత్యాసం దాదాపు ఇంతే. ఈ రెండు జిల్లాల్లోనూ మునుపెన్నడూ లేనంతగా వేతన బకాయిలు కూడా ఉన్నాయి. వేసవి అలవెన్సులను పూర్తిగా రద్దుచేశారు. పని ప్రదేశాల్లో నీరు, నీడ కల్పించేందుకు చట్టంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడం లేదు. పనిలో ఉపయోగించే పార, గుణపాం, తట్టలు, గమేలాలు వంటి పనిముట్లకు గతం మాదిరిగా మెయింటెనెన్స్ ఛార్జీలను ఇవ్వడం లేదు. ఉపాధి కూలీలను ఇలా ఇబ్బంది పెట్టడం ద్వారా పని కోరుకునేవారి సంఖ్యను తగ్గించి, సంఖ్య తగ్గింపును బూచిగా చూపించి ఉపాధి చట్టాన్ని పూర్తిగా దూరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుంది. కేంద్రం తెచ్చిన నిబంధనల వల్ల కండరాలు కరిగిపోతున్నా అందుకు తగ్గ ఫలితం దగ్గడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లాలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వలసలు పోవాల్సిన దుర్భిక్ష పరిస్థితులు ఎదురౌతాయని కూడా తల్లడిల్లుతున్నారు. ఈనేపథ్యంలో కూలీలంతా కేంద్రం కుట్రలపై ఐక్యంగా పోరాడడమే శరణ్యంగా మారింది.

ఈ సారి పరీక్షలు 'పది'లమేనా?

●అసౌకర్యాల నడుమ పదో తరగతి పరీక్షలు ● లైట్లు వెలగవు.. ఫ్యాన్లు తిరగవు.. ● విద్యార్థులకు ఆటోలే ఆధారం ●తప్పని అవస్థలు.. పట్టించుకోని విద్యాశాఖ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈ ఏడాది 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించడంతోపాటు విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో పాటు జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు పదేపదే మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ వీరి నిర్లక్ష్యం వల్ల

గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ఆటోలో వస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలతో పాటు బీటీవాడ, నీలానగరం, గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో 668 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యార్థులకు తప్పని అవస్థలు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థుల పరీక్షలు రాసేందుకు ఏడు గదులను కేటాయించారు. ఇందులో మూడు రూముల్లో ఫ్యాన్లు ఉంటే లైట్లు లేవు, లైట్లు వెలిగితే ఫ్యాన్లు తిరగవు. ఎంతో చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో అనేకమంది చదివి వివిధ స్థాయిల్లో ఉన్నారు. కానీ సౌకర్యాలు మాత్రం లేదు. రెండేళ్ల కిందట రూ. 1.60 కోట్ల నాబార్డు నిధులతో అదనపు భవనాలు నిర్మించినప్పటికీ ప్లాస్టింగ్ తప్ప ఎటువంటి లైటింగ్ సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రస్తుతం గదులు చిమ్మ చీకటిలో దర్శనమిస్తున్నాయి. పాఠశాల దీనస్థితికి చేరిందంటే కేవలం అధికారుల నిర్లక్ష్యమని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. మిగిలిన పరీక్ష కేంద్రాలు కూడా ఇదే పరిస్థితని చెప్పక తప్పదు.

ఆటోలే ఆధారం

మండలం పరిధిలోని గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, బీటీవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలు మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఉండటం వల్ల వాటికి ఎటువంటి బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు ఆటోలపైనే ఆధారపడి పరీక్షా కేంద్రాలకు చేరుకునే పరిస్థితి ఉంది.ప్రస్తుతం ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే ఆటోలపైనే ఆధారపడుతున్నారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రయాణ సమయం కూడా వారికి ఇబ్బందిగానే ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పరీక్ష కేంద్రాలలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కురుపాం జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో తిరగని ఫ్యాన్

కోనేరు అభివృద్ధికి వితరణ

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో పారమ్మ కోనేరు అభివృద్ధిని కాంక్షిస్తూ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు రూ.2 వేలు, ప్రధాన కార్యదర్శి అల్లు సత్యం రూ.2వేలును నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ద్వారా గీతా మందిర నిర్మాణకర్త గంట సాధుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు కృష్ణమూర్తినాయుడికి, అల్లు సత్యంకి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో గొర్లె శ్రావణ్ కుమార్, కోట చిన్న, కర్రి ఈశ్వరరావు, బొద్దాన సింహాచలం, మామిడి శివాజీ పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు రూ.3.86 కోట్లు

కమిషనర్ రామ అప్పలనాయుడు

పార్వతీపురం టౌన్ : పట్టణంలో ఇంటి పన్నులను రూ.3కోట్ల 86 లక్షలు వసూలైందని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఇంటి స్థలాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాల పన్నులు రూ.4 కోట్ల 5 లక్షలు కాగా, మార్చి 31 నాటికి రూ.3 కోట్లు 86 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.19లక్షలు మాత్రమే బకాయిలు ఉన్నాయని, పన్నుల వసూళ్లలో ఆర్ఐ దిబ్బా రూబెన్, రెవిన్యూ ఆర్ఐలు పి.నారాయణరావు, జి.వినయకుమార్ లు, మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాలు అధికారులు, 13 సచివాలయాల సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు ఎక్కువగా కృషి చేయడంతో ఈ లక్ష్యాన్ని సాధించినట్టు తెలిపారు.

డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

తనిఖీలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

సీతానగరం : మండలం లోని మరిపు వలస, నిడిగల్లు ఆరోగ్య ఉప కేంద్రాలను డిఎం హెచ్ఒ బి.జగన్నాథ రావు శని వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీల్లో రక్తహీనతను గ్రహించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి గర్భిణీ ప్రతినెలా తనిఖీలు చేసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించేందుకు వారికి స్కూళ్లలో తనిఖీలు నిర్వహించి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆటో డ్రైవర్‌కు సూచనలు చేస్తున్న ఎస్ఐ నీలకంఠం

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్‌లో శనివారం ఎస్సై కె.నీలకంఠం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనం పత్రాలు తప్పనిసరిగా చూపించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఇక్కించరాదన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. పెండింగ్ కేసులుంటే వాహనదారులు చలానాలను కట్టే క్లియర్ చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎఎస్ఐ శ్రీనివాసరావు, వాసుదేవరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : పట్టణంలో శనివారం ఎస్ఐ శివప్రసాద్ వాహనాలు తనిఖీలు చేశారు. హెల్మెట్లు ధరించని వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఎటువంటి పత్రాలు లేనివారిపై కూడా కేసులు నమోదు చేశారు. హెల్మెట్లు ప్రతి ఒక్కరు ధరించాలన్నారు.

3న పి.లేవిడిలో నేత్ర వైద్య శిబిరం

కురుపాం : మండలంలోని పి.లేవిడిలో ఏసు తిరుహృదయ దేవాలయం సమీపాన ఈనెల 3న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పి.లేవిడి యంగ్ స్టార్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. స్వరాజ్, పి.అజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారు వచ్చి వైద్యులకు చూపించుకోవాలని, అవసరమైన వారికి మందులు, కంటి ఆపరేషన్ అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించి ఆపరేషన్ చేయించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7న 'జగనన్నే మా భవిష్యత్తు'

సీతానగరం : ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమంపై మండలం నాయకులకు స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు దిశానిర్దేశ చేశారు. ఇందులో భాగంగా శనివారం సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆయా సచివాలయాల్లో ఈనెల 1నుంచి 5వరకూ సమావేశాలు నిర్వహించాలన్నారు. 7న ప్రచార కార్యక్రమం ప్రారంభించి, 14 నాటికి అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో గల ప్రతి గ్రామంలో ఇంటి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

పాలకొండ : మాజీ సర్పంచ్ ఎస్ఎంవి గోపాలరాజు జయంతి సందర్భంగా శనివారం కుటుంబసభ్యులు వెంకటరాయుని కోనేరు వద్ద పేదలకు బట్టలు పంపిణీ చేశారు. సుమారు 40 మంది పేదలకు బట్టలు అందించారు. అదే విధంగా ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

క్రీడాకారులకు ఉచిత శిక్షణ

పాలకొండ : పాలకొండ నియోజకవర్గం పరిధిలో క్రీడాకారులకు ఈ నెల 30వ వరకు ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని వ్యాయామ ఉపాధ్యాయులు పుష్పనాథం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9908689050 ఫోన్‌నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. 8 నుంచి 16ఏళ్లలోపు బాల బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

కోటదుర్గమ్మ ఆలయ ఇఒ బదిలీ

పాలకొండ : స్థానిక కోటదుర్గమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి వి.రాధాకృష్ణ బదిలీ అయ్యారు. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి దేవస్థానం ఇఒగా బదిలీ అయ్యారు. ఈయన సుమారు ఏడాది కాలం మాత్రమే ఇక్కడ పనిచేశారు.

రక్తదానం చేస్తున్న అనిల్

గర్భిణీ ప్రాణాలు కాపాడిన అనిల్

కలెక్టరేట్ : అలమండ పంచాయతీ, రామచంద్రపురం గిరిజన గ్రామానికి చెందిన గర్భిణీ అయిన ఉర్లక బుజ్జితను ప్రసవ నిమిత్తం స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో చేర్పించారు. ఆమెకు ఎబి+ రక్తం అవసరం కాగా చాలా రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మోణింగి బాష ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణకు తెలిపారు. ఆయన 22వ వార్డు, దేవీనగర్ నివాసి సుంకరి అనిల్ కుమార్‌ను సంప్రదించగా, మంచి మనసుతో వెంటనే స్పందించి రక్తదానం చేసి గర్భిణి ప్రాణాలను కాపాడారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ జిల్లా కమిటీ సభ్యులు బోటు రామకష్ణ, తాడి రమేష్ (రిటైర్డ్ ఆర్మీ), నందిగాన ముని సాయి, జిల్లా కోఆర్డినేటర్ యమ్మల జనార్దన్‌రావు పాల్గొన్నారు. రక్తదానం చేసిన అనిల్‌కుమార్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మెన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, రోగి కుటుంబీకులు అభినందించారు.

ఉరుములు.. మెరుపులతో వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో శనివారం ఉరుముల, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుండి ఎండ తీవ్రత ఉన్నప్పటికీ మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మబ్బులు ఏర్పడి ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో వీరఘట్టం ప్రధాని రహదారి బురదతో నిండిపోయింది. దీంతో వాహన దారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సీతంపేట: మండలంలో శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంట సేపు పైగా వర్షం కురవడంతో రాకపోకలు స్తంభించాయి. గిరిజన రైతులు జీడి మామిడి పంటలు ఈ వర్షం దెబ్బకు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అకాల వర్షాలకు జీడి మామిడి పింజులు రాలిపోయావని ప్రస్తుతం 20 రోజులుగా ప్రతిరోజు వర్షం కురుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడు

వీరఘట్టంలో కురుస్తున్న వర్షం

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

పాలకొండ రూరల్ : పాలకొండలో శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత ఆందోళనకు గురయ్యారు. అయితే వేసవి తాపానికి ఈ వర్షం ఊరటనిచ్చిందని ప్రజలు చెబుతున్నారు.

కురుపాంలో శనివారం సాయంత్రం భారీ వర్షం పడింది.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 5న నిర్వహించనున్న చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ కోరారు. శనివారం నాలుగు రోడ్ల కూడలి వద్ద పట్టణ కార్మిక సంఘ నాయకులు బంకురు సూరిబాబు, గుడుపూరు కృష్ణతో కలిసి ఆయన పోస్టర్‌ను విడుదల చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ. 10వేలు ఇవ్వాలని, నాలుగు లేబరు కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైం స్కేల్, స్కీం వర్కర్స్, డైలీవేజ్, కంటెంట్ ఉద్యోగులను, కార్మికులను రెగ్యులైజేషన్ చేయాలన్నారు. 2022 విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, కేరళ ప్రభుత్వం వలె నిత్యవసర సరుకులు 14 రకముల దినసులు రేషన్ డిపోల ద్వారా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, తోపుడుబండ్ల చిల్లర వర్తకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని గడివలస వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే లక్షలాదిమందితో జరిగే ప్రదర్శనను కదిలి జయప్రదం చేయాలని

పార్వతీపురం: ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

కరపత్ర విడుదల చేశారు. కార్యక్రమంలోని ప్రజాసంఘాల నాయకులు కోరాడ ఈశ్వరరావు, గంట కష్ణ, మసుపర్తి విశ్వేశ్వరరావు, సాలాపు సూర్యనారాయణ, కె.సత్యనారాయణ మాట్లాడుతూ మోడీ అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ లక్షలాదిమందితో ఢిల్లీలో ఏప్రిల్ 5న జరిగే ప్రదర్శనలో ప్రజలంతా కదలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాత, శిశు ఆరోగ్యమే ధ్యేయం

ప్రజాశక్తి - సీతానగరం

మాతా, శిశు ఆరోగ్యమే ధ్యేయంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన కోటసీతారాంపురం, చినభోగిలి, పెదబోగిలి గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన జనని సెషన్స్ కార్యక్రమాలను సందర్శించి మాతాశిశు సంరక్షణ కార్డులను, పిల్లల టీకాకార్డులను, గర్భిణీల సందర్శన తేదీలను, రక్త పరీక్షల గణాంకాలను పరిశీలించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న గర్భిణీలను త్వరగా గుర్తించి రక్త హీనత నివారణ దిశగా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఐరన్ సక్రోజ్ ఇంజక్షన్లు, పౌష్ఠికాహారం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన కొంత

రికార్డులను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

మంది గర్భిణులకు వైద్య సిబ్బందిచే హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించి గణాంకాలను పరిశీలించారు. గణాంకాలకు అనుగుణంగా ఆరోగ్యస్థితిని కూడా పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే పిల్లల టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించి టీకా కార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు ఉషారాణి, రాధాకాంతం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎంఎస్‌కెఎల్ ప్రసాద్ అన్నారు. మండలంలోని అప్పయ్యపేటలో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి పూర్తి చేయాలని, లేకుంటే పట్టాలు రద్దు చేస్తామని అన్నారు. లబ్ధిదారునికి కావాల్సిన సామాగ్రిని అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కావున లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపిడిసి సభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ, హౌసింగ్ ఎఇ జానకిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, సత్యంనాయుడు, పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఎంపిడిఒ ఎంఎస్ఎల్‌కె ప్రసాద్

ఎంపిడిఒను సత్కరిస్తున్న సచివాలయ సిబ్బంది

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లు చేయాలని, చెత్త సంపద కేంద్రాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాలు, కాలువల సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు నిరంతర శ్రమ

ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు, 16 స్తంభాలకు నష్టం జరిగినట్లు అంచనా

ప్రజాశక్తి - మక్కువ

వరుసగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుండడంతో విద్యుత్ శాఖ అధికారులకు కునుకు పట్టడం లేదు. గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది, విద్యుత్ తీగెలపై చెట్లు విరిగిపడడంతో మండలంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం నుంచి శనివారం వరకు రాత్రీ పగలు శ్రమించి విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. మార్కొండపుట్టి, దుగ్గేరు ఫీడర్ల పరిధిలోని విద్యుత్ తీగలు తెగి పోవడంతో పాటు స్తంభాలు కూడా విరిగిపోయాయి. ప్రస్తుతం ఈదురు గాలుల వల్ల విద్యుత్ శాఖకు జరిగిన నష్టంపై సిబ్బంది అంచనా వేస్తున్నారు.

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు, ఎదురుగాళ్లకు నష్టపోయిన తోటలను ఉద్యానశాఖ హెచ్ఒ ప్రత్యూష భాను శనివారం పరిశీలించారు. జీడి, మామిడి, అరటి తోటలకు జరిగిన నష్టాన్ని ఆమె అంచనా వేస్తున్నారు. నంద, మార్కొండపుట్టి, ఎస్.పెద్దవలస తదితర పంచాయతీల్లో ఆమె పర్యటించారు. పంట నష్టాలను గ్రామ ఉద్యాన శాఖ సిబ్బంది ద్వారా జాబితాలను తయారు చేయమని ఆమె సూచించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేసి నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని ఆమె రైతులకు తెలిపారు.

పంట నష్టాల అంచనాలో అధికారులు

సాలూరురూరల్ : మండలంలో శుక్రవారం వీచిన ఊదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న, అరటి పంటలు ఏ ఏ రైతు వద్ద ఎంత నష్టం జరిగిందో అంచనాను గ్రామ వ్యవసాయ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ అధికారి సంధ్య బాధితుల రైతుల పొలాలకు వెళ్లి ఏ రైతు ఎన్ని ఎకరాల పంటను వేసి ఉన్నారు. అందులో ఎంతవరకు నష్టం జరిగిందన్న దానిపై ప్రాథమికంగా సర్వే నిర్వహించారు. ఇందులో బూస ఆదినారాయణకు చెందిన ఐదెకరాల్లో అరటితోటకు గాను మూడెకరాలు పంట నాశనమైంది. మామిడిపల్లికి చెందిన నల్లి గంగేశ్వరరావు 20 ఎకరాల అరటితోటలో 8 ఎకరాల వరకు నష్టపోయినట్టు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అరటి పంటను పరిశీలిస్తున్న విఎఒ

శాస్త్రీయ ఆలోచనలు కలిగించేలా కృషి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో శాస్త్రీయ ఆలోచనలు విస్తృతం చేయడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి ఆకాంక్షించారు. స్థానిక గిరిజన సామాజిక భవనంలో జరిగిన జెవివి జిల్లా శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, చేత బడి, సారాయి లాంటి వాటి వల్ల యువత, సమాజం నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సైన్స్ చదివిన మేధావులు సైతం మూఢనమ్మకాల వైపు ఆలోచనలు చేయడం ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. సమాజ మార్పు కోసం జనవిజ్ఞాన వేదికతో కలిసి ముందుకు సాగుతానని తెలిపారు. జెవివి జాతీయ కార్యదర్శి గండ్రేటి అప్పలనాయుడు మాట్లాడుతూ అక్షర విజయం, సార వ్యతిరేక ఉద్యమం, మహిళా పొదుపు సంఘాల ఏర్పాటుకు జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలు దోహదపడ్డాయని తెలిపారు. జెవివి గౌరవాధ్యక్షులు గంటేడ గౌరునాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, జిల్లా అధ్యక్షులు ఆర్.రత్నకుమార్, కోశాధికారి ఫరూక్, జిల్లా కార్యదర్శి దనాల చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి పి.రంజిత్ కుమార్, జాతీయ సాంస్కృతిక కమిటీ కార్యదర్శి గండ్రేటి శ్రీనివాసరావు(డప్పు శ్రీను) జెవివి జాతీయ నాయకులు గండ్రేటి లక్ష్మ నాయుడు, డాక్టర్ ఎవి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జమదాలలో గడపగడపకు

పార్వతీపురంరూరల్ : మండలంలోని జమదాలలో శనివారం గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన జరిగింది. ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకొని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని, సంక్షేమ పథకాలను తెలియపరుస్తూ వారికి ఏమైనా సమస్యలుంటే అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీపురం గిరిజనులు మాజీ సర్పంచ్ బంకపల్లి రామకృష్ణను ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు. ఎంపిపి ఎం.శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిడిఒ విజయలక్ష్మి, నాయకులు బంకపల్లి రామకృష్ణ, వాసుదేవరావు, నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జెఎసి కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

పేదల మెడకు విస్తరణ ఉచ్చు

●నిలువ నీడ కోల్పోయిన రెండు కుటుంబాలు ● సహాయం కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి - కురుపాం

రహదారి విస్తరణ పుణ్యమా అని అభివృద్ధి జరుగుతుందన్న ఆనందం కంటే, అత్యంత నిరుపేదలైన రెండు కుటుంబాలకు నిలువ నీడ కూడా లేకుండా పోయిందన్న బాధ అందరికీ కంటతడి పెట్టిస్తోంది. కురుపాం ఊరిని నమ్ముకుని సుమారు ఐదు దశాబ్దాల క్రితం వలస వచ్చిన గిరిజనుడు మొండి క్రిష్ణ తాను నేర్చుకున్న బైక్ మెకానిజంనే వృత్తిగా చేసుకుని జీవితం గడుపుతూ గతంలో దాతలు సహాయం, తన కష్టార్జితంతో జిసిసి గోడకు ఆనుకుని

జిసిసి షెడ్డులో తలదాచుకున్న మెకానిక్ కృష్ణ దంపతులు

చిన్న రేకుల షెడ్డు వేసుకుని అక్కడే నివాసం, మెకానిక్ పనిచేసుకుంటూ భార్య సావిత్రితో కలిసి జీవిస్తున్నారు. రహదారి విస్తరణలో ఉన్న చిన్న పాటి ఇళ్ళు కూడా ధ్వంసమైంది. గత్యంతరం లేక జిసిసి గుడౌన్స్‌లో తాత్కాలికంగా తలదాచుకుంటున్నారు. ఈ రోడ్డు విస్తరణ ఉచ్చు తల్లి తండ్రులు లేని మరో నిరుపేద ఒంటరి మహిళకు కూడా బిగిసుకుంది. బొంగు మంగమ్మ దాసరి వీదిలో ప్రధాన రహదారి ఆనుకుని తాతల నుంచి వస్తున్న సొంత పెంకిటింటిలో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈమెకు ఉన్న ఏకైక ఆస్తి ఆ ఇళ్ళు ఒక్కటే. వ్యవసాయ కూలి పనులు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వికలాంగ పింఛన్‌తో జీవనం గడుపుతూ ఉంది. శనివారం జరిగిన రహదారి విస్తరణలో బాత్రూమ్ మినహా మిగిలిన ఇళ్ళు మొత్తం పోవడంతో సర్వం కోల్పోయి రోడ్డున పడింది. నిలువనీడ లేక బంధువులు దయాదాక్ష్యణ్యాలతో తలదాచుకునే పరిస్థితికి వచ్చింది. ఈ రెండు కుటుంబాలూ సహాయం చేసే ఆపన్న హస్తం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాయి. స్థానిక ప్రభుత్వ అదికార యంత్రాంగం, ఎమ్మెల్యే చొరవ చూపించి ఇళ్ళు నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇంటిని కోల్పోయిన బొంగు మంగమ్మ

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

మండల కేంద్రంలో రహదారి విస్తరణ, ఆక్రమణల తొలగింపు పనులు ఆర్అండ్‌బి అధికారుల ఆధ్వర్యంలో చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే కురుపాం బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా విస్తరణ, అక్రమణల తొలగింపులను యంత్రాల సాయంతో చేపట్టారు. మరోవైపు కొందరు స్వచ్ఛందంగా అధికారులు ఇచ్చిన మార్కు ప్రకారం నిర్మాణాలను తొలగించుకుంటున్నారు. గ్రామంలోని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఆసుపత్రి పక్కన నుంచి ఉన్న రోడ్డు వెంబడి వాహనాలను పంపిస్తున్నారు. దీంతో పనులు పూర్తియ్యేంత వరకు వన్‌వే మార్గం ఉంటుందని, వాహనదారులు, స్థానికులు గమనించి సహకరించాలని

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : పట్టణ పరిధిలోని కొత్తవలస - విజయరామరాజు కాలనీ నివాసి రెడ్డి మణికంఠ శనివారం మనస్థాపంతో ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్పందించిన స్థానికులు వెంటనే స్థానిక జిల్లా అసుపత్రికి తరలించారు. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం మణికంఠ భార్య పిల్లలను తీసుకొని కొద్దినెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటిరిగా ఉన్న ఉన్న ఆయన చాలారోజులు మానసిక వ్యధ అనుభవిస్తున్నాడని, అదే క్రమంలోనే ఆత్యహత్యకు పాల్పడినట్టు స్థానికులు చెబుతున్నారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వివరాలు ఔట్ పోస్టు పోలీస లు నమోదు చేశారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణికంఠ